# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు.

- ❖ విద్యార్థులు తమ విజ్ఞానం, నైపుణ్యాలు, ఆవిష్కరణలను దేశ నిర్మాణానికి ఉపయోగించాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు.

- ❖ గత 12 ఏళ్లలో ప్రభుత్వం రైతులకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి... కనీస మద్దతు ధరలను నిరంతరం పెంచిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

- ❖ న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలు రేపు ప్రారంభం కానున్నాయి.

======================

పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఈ రోజు న్యూఢిల్లీలో వాజ్‌పేయి స్మారక స్థూపం `సదైవ్ అటల్` వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘన నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ కూడా ఉన్నారు. వాజ్‌పేయి శాశ్వతమైన వారసత్వం దేశానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటుందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. భారతదేశ పురోగతిలో వాజ్ పేయి పాత్ర సాటిలేనిదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ సేవకు ఆయన తన జీవితాన్ని అంకితం చేసిన అసాధారణ రాజనీతిజ్ఞుడు అని ప్రధానమంత్రి కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యార్థులు తమ విజ్ఞానం, నైపుణ్యాలు, ఆవిష్కరణలను దేశ నిర్మాణానికి ఉపయోగించాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. చెన్నై సమీపంలోని కాట్టాన్‌కులత్తూర్‌లో ఉన్న ఎస్.ఆర్.ఎం. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 22వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ... 2047 నాటికి వికసిత్ భారత్ సాధించే ప్రయాణంలో దేశ యువత కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. కోవిడ్ సమయంలో భారతదేశం 100కి పైగా దేశాలకు టీకాలను సరఫరా చేసిందని, ఇది ప్రపంచ సంక్షేమం, మానవత్వం పట్ల దేశాని ఉన్న నిబద్ధతను చాటి చెప్పిందన్నారు. ఉన్నత విద్యలో మహిళల భాగస్వామ్యం పెరుగుతోందని సీపీ రాధాకృష్ణన్ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రపంచ దేశాల నాయకులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కృతజ్ఞతలు తెలిపారు. మాల్దీవులు, నేపాల్, స్లొవేకియా, ఇజ్రాయెల్ అధ్యక్షులకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. ఆయా దేశాలతో భారతదేశ భాగస్వామ్యం మరింత వృద్ధి చెందాలని, ప్రజల మధ్య స్నేహ బంధాలు మరింత బలపడాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. అదే విధంగా భారత స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఇజ్రాయెల్ అధ్యక్షులు ఐజాక్ హెర్జోగ్, ప్రధాని బెంజమిన్ నెతన్యాహులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా కృతజ్ఞతలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి సిద్ధాంతాలతో రాజీపడని, అజాతశత్రువుగా మెలిగిన మహనీయుడని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కొనియాడారు. రాజస్థాన్‌లోని చిత్తూరుగఢ్ జిల్లా నింబహేరాలో ఈరోజు వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రధానమంత్రిగా వాజ్‌పేయి ఎప్పుడూ దేశమే ప్రథమం (నేషన్ ఫస్ట్) అనే భావనతోనే పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

యూజీసీ-నెట్ (UGC-NET) జూన్-2026 పరీక్షకు సంబంధించి 84 సబ్జెక్టుల ప్రొవిజనల్ ఆన్సర్ కీలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) ఈరోజు విడుదల చేసింది. ఆన్సర్ కీలపై అభ్యంతరాల స్వీకరణకు ఈనెల 18వ తేదీ వరకు NTA అవకాశం కల్పించింది. అభ్యర్థులు అధికారిక యూజీసీ-నెట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆన్సర్ కీలను సవాలు చేయవచ్చు. ప్రతి అభ్యంతరానికి తగిన డాక్యుమెంటరీ ఆధారాలను జత చేయాలని పేర్కొంది. ఇతర మార్గాల ద్వారా సమర్పించే అభ్యంతరాలను స్వీకరించబోమని NTA ఏజెన్సీ స్పష్టం చేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి... కనీస మద్దతు ధరలను నిరంతరం పెంచిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఈరోజు నిర్వహించిన ఒక కార్యక్రమంలో 17 జిల్లాల్లో రూపుదిద్దుకోనున్న 6 వేల 453 అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేసి, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం అమిత్ షా మాట్లాడుతూ... దేశాన్ని 2047 నాటికి పూర్తిగా అభివృద్ధి చెందిన

దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో యువకులు, పేదలు, మహిళలు, రైతులను సాధికారత సాధించడం ఎంతో ముఖ్యమని అన్నారు. రాజస్థాన్‌లోని ప్రతి ఇంటికి అధిక దిగుబడినిచ్చే ఆవులు, గేదెల జాతులు చేరేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మార్చడంలో పాడిపరిశ్రమ రంగానికి ఉన్న సామర్థ్యాన్ని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలో ఈ నెల 18వ తేదీన 12వ బ్రిక్స్ పర్యావరణ మంత్రుల సమావేశానికి భారతదేశం ఆతిథ్యం ఇవ్వనుంది. రేపు జరగనున్న బ్రిక్స్ పర్యావరణ వర్కింగ్ గ్రూప్, వాతావరణ మార్పు, సుస్థిర అభివృద్ధిపై కాంటాక్ట్ గ్రూప్ సీనియర్ అధికారుల సమావేశం అనంతరం ఈ భేటీ జరగనుంది. బ్రిక్స్ పర్యావరణ మంత్రుల సమావేశానికి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అధ్యక్షత వహిస్తారు. ఒకే ఆలోచనలతో కూడిన చర్చలలో పాల్గొనడానికి, ఏకాభిప్రాయాన్ని పెంపొందించుకోవడానికి, పర్యావరణ సహకారాన్ని బలోపేతం చేయడానికి ఈ సమావేశం ఒక వేదికగా ఉంటుందని ఆ మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ రేపు ప్రారంభం కానుంది. 17 సంవత్సరాల తర్వాత భారత్ ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ఆతిథ్యమిస్తోంది. భారత జట్టు తరఫున పీవీ సింధు, లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి, సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి, త్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ పోటీల సందర్భంగా భారత క్రీడాకారిణి పీవీ సింధు పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అరుణాచల్ ప్రదేశ్, గంగా పరీవాహక పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోని కొన్ని ప్రాంతాలలో ఈరోజు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. అదే విధంగా వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉత్తర ఒడిశాలో వరద ముప్పు తీవ్రమైందని, మంగళవారం వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఇదిలా ఉండగా ఒడిశాలో పలు నదులు పరీవాహక ప్రాంతాలను ముంచెత్తుతుండటంతో.. ఆరు జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంక, భారత్ జట్ల మధ్య గాలే స్టేడియం వేదికగా జరుగుతున్న తొలి టెస్టు క్రికెట్ మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 9 వికెట్ల నష్టానికి 460 పరుగులు చేసింది. 288 ఓవర్ నైట్ స్కోరుతో ఈరోజు ఆటను ప్రారంభించిన భారత్ ఏడు వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది. బ్యాటర్ దేవదత్ పడిక్కల్ 167 పరుగులతో రాణించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =